క్లుప్తంగా

ఆలయాలకు రూ.2.50 లక్షల వితరణ



ఆలయాల అభివృద్ధికి రూ.2.50 లక్షల విరాళం అందిస్తున్న దొడ్డి సోదరులు

మునగపాక: మండలంలోని నాగులాపల్లిలో నిర్మిస్తున్న దేవాలయాలకు మాజీ వైస్ ఎంపీపీ దొడ్డి వరాహ సత్యనారాయణ, దొడ్డి బుజ్జి రూ.2.50 లక్షల విరాళాలను మంగళవారం అందించారు. గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న రామాలయం, వేంకటేశ్వరాలయాల అభివృద్ధికి తమ వంతు సాయం అందించి, భక్తిని చాటుకున్నారు. హైందవ సంస్కృతీ, సంప్రదాయాల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యల్లపు భాస్కరరావు, ఎంపీటీసీ మళ్ల కాశీ సురేష్, గ్రామ పెద్దలు రాజునాయుడు, కోటేశ్వరరావు, నూకాలయ్య తదితరులు పాల్గొన్నారు.

భూ రీసర్వే వేగవంతానికి కృషి

మునగపాక: గ్రామాల్లో భూ రీ సర్వే పనులను వేగవంతం చేయాలని తహసీల్దార్ ప్రకాశరావు కోరారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో మంగళవారం వీఆర్వోలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీ సర్వే పనుల్ని త్వరితగతిన పూర్తి చేసేందుకు కృషి చేయాలన్నారు. రైతులకు ముందస్తు సమాచారం అందించాలన్నారు. రీసర్వే పూర్తయిన గ్రామాల్లో సరిహద్దు రాళ్లు పాతేలా చూడాలన్నారు. రీసర్వే ద్వారా కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించాలని తెలిపారు. సమావేశంలో డీటీ వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

పెరిగిన తుప్పలతో అవస్థలు



తుప్పలమయంగా కాకరాపల్లిరోడ్డు

మునగపాక: మండలంలోని నారాయుడు పాలెం నుంచి కాకరాపల్లికి వెళ్లే రోడ్డుకు ఇరువైపులా తుప్పలు, పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. దీంతో ఈ రోడ్డు మీదుగా రాకపోకలు సాగించేవారు అవస్థలు పడుతున్నారు. నిత్యం ఈ రహదారి మీదుగా అటు అనకాపల్లి, ఇటు మండల కేంద్రం మునగపాకకు రాకపోకలు సాగిస్తుంటారు. పిచ్చి మొక్కలు రహదారిపైకి వచ్చేయడంతో ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించడం లేదు. దీంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అధికారులు స్పందించి తుప్పలు తొలగింపునకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రోటరాక్ట్ నూతన కార్యవర్గం



నూతన కార్యవర్గ పదవీ బాధ్యతల స్వీకరణ

పాయకరావుపేట: రోటరాక్ట్ క్లబ్స్ ఆఫ్ యంగ్ లీడర్స్, సబల నూతన కార్యవర్గ నియామకం, పదవీ బాధ్యతల స్వీకరణ ఘనంగా జరిగింది. శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల అనుబంధ డిగ్రీ కళాశాల స్పేసెస్‌లో మంగళవారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రోటరాక్ట్ డిస్ట్రిక్ట్ కమిటీ చైర్మన్ రోటేరియన్ రవి, గౌరవ అతిథులుగా తుని రోటరీ క్లబ్ అధ్యక్షుడు రోటేరియన్ కేఎస్ఎస్ఎల్ వర్మ, కార్యదర్శి కిషోర్‌రెడ్డి, తుని రోటరాక్ట్ చైర్మన్ భానుపూజిత్‌లు పాల్గొన్నారు. 2023–2024 సంవత్సరానికి రోటరాక్టర్ షణ్ముఖ్, రీనా అధ్యక్షులుగా నియమితులయ్యారు. నూతన కార్యవర్గానికి ప్రస్తుత ప్రతినిధులు పార్థసారథి, లహరి అభినందిస్తూ, తమ బాధ్యతల్ని వారికి అప్పగించారు. గత ఏడాది రోటరాక్ట్ క్లబ్ ద్వారా రక్తదాన శిబిరాలు నిర్వహించామని, ఈ ఏడాది మరిన్ని సేవా కార్యక్రమాలతో క్లబ్‌ను ముందుకు నడిపిస్తామని నూతన కార్యవర్గం పేర్కొంది. తమ విద్యార్థులు చేసే కార్యక్రమాలకు రోటరాక్ట్ పూర్తి సహాయ సహకారాలను అందిస్తోందని కళాశాల ప్రిన్సిపాల్ కె.వీర్రాజు తెలిపారు.

ఉప ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల

నక్కపల్లి: మండలంలోని చినదొడ్డిగల్లు 1వ వార్డు, రేబాక 3వ వార్డు ఉప ఎన్నికల నిమిత్తం ఎన్నికల కమిషన్ ఉత్తర్వుల మేరకు నోటిఫికేషన్ కాపీని ఎంపీడీవో కార్యాలయం నోటీసు బోర్డునందు, చినదొడ్డిగల్లు, రేబాక పంచాయతీ కార్యాలయం వద్ద, ఎన్నికలు నిర్వహించు పాఠశాలల వద్ద మంగళవారం అతికించారు. 8వ తేదీ నుంచి 10వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించనున్నట్లు ఎంపీడీవో కార్యాలయ అధికారులు తెలిపారు. 19న ఎన్నికల నిర్వహణ, లెక్కింపు, ఫలితాల ప్రకటన ఉంటుందన్నారు.

దశాబ్దాల కల.. నెరవేరిన వేళ

- శరవేగంగా పూర్తవుతున్న అల్లుమియ్యపాలెం రోడ్డు నిర్మాణం
- హామీని నిలబెట్టుకున్న ఎమ్మెల్యే బాబూరావుకు కృతజ్ఞతలు

అల్లుమియ్యపాలెం రోడ్డు.. దశాబ్దాల నుంచి అపరిష్కృతంగా ఉన్న సమస్య. పుంతలు, గుట్టలు, దిబ్బలు దాటుకుంటూ నడకతో గిరిజనుల నరకయాతన. పక్కా రోడ్డు కోసం వారు మొరపెట్టుకోని నాయకుడు లేడు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో తమ దశాబ్దాల కల నెరవేరడంతో ఆ 'గిరి'జనంలో చెప్పలేనంత ఆనందం.



భారీ యంత్రాల సాయంతో చురుగ్గా సాగుతున్న అల్లుమియ్యపాలెం రోడ్డు నిర్మాణ పనులు



గ్రామ సమీపం వరకు కొత్తగా వేసిన తారు రోడ్డు

కోటవురట్ల: మండలంలోని రామచంద్రపురం శివారు అల్లుమియ్యపాలెం ఓ గిరిజన గూడెం. మైదానంలో ఉందన్న మాటేగానీ అంతా ఏజెన్సీ వాతావరణమే. చుట్టూ కొండల నడుమ ఉన్న ఈ గిరిజనులు పక్కా రోడ్డు కోసం ఏళ్ల తరబడి అధికారులకు, ప్రజాప్రతినిదులకు మొరపెట్టుకుంటూనే ఉన్నారు. ఇన్నేళ్లకు సీఎం జగన్ ప్రభుత్వంలో వారి ఆశ నెరవేరి, ఆనందం అంబరాన్నంటింది.

హామీ నిలబెట్టుకున్న ఎమ్మెల్యే బాబూరావు

రోడ్డు హామీతో ఎన్నికల్లో గెలిచిన గత టీడీపీ అభ్యర్థి వంగలపూడి అనిత మొహం చాటేశారు. ఎన్నికల్లో గెలిచి, తమ ప్రభుత్వం అధికారంలో ఉన్నపుడు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకున్న పాపాన పోలేదు. అప్పట్లో ఈ గ్రామానికి వెళ్లే మట్టిరోడ్డులో ఉన్న ఓ గెస్ట్‌హౌస్‌కు వచ్చిన అప్పటి ఐటీ మంత్రి నారా లోకేష్‌ను కలిసి గిరిజనులు మొరపెట్టుకున్నారు. ఆయన కూడా హామీతోనే సరిపెట్టారు. వీరి సమస్య మాత్రం పరిష్కారానికి నోచుకోలేదు. ఈలోగా 2019 ఎన్నికలు రానే వచ్చాయి. అనిత మళ్లీ హామీ ఇచ్చేశారు. ప్రస్తుత ఎమ్మెల్యే గొల్ల బాబూరావు కూడా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రోడ్డు నిర్మిస్తామని ప్రజలకు చెప్పారు. అనితను నమ్మని గిరిజనం గొల్ల బాబూరావుకు పట్టంగట్టారు. వైఎస్సార్‌సీపీ వెంట నడిచారు. ప్రభుత్వం వచ్చాక ఇచ్చిన హామీ మేరకు ఎమ్మెల్యే బాబూరావు సీఎం జగన్ దృష్టికి రోడ్డు సమస్యను తీసుకెళ్లారు. సమస్య పరిష్కారానికి కృషి చేశారు.

రూ.3.36 కోట్లతో రోడ్డు నిర్మాణం

ఎమ్మెల్యే బాబూరావు కృషి, సీఎం జగన్ చొరవతో ఈ రోడ్డు నిర్మాణానికి రూ.3.36 కోట్లు మంజూరయ్యాయి. దీంతో ఆరు మాసాల క్రితం రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం రోడ్డు నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. దాదాపు గ్రామం వరకు తారురోడ్డు వేశారు. దీంతో గిరిజనులు పట్టరాని సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. అసలు తారు రోడ్డును తమ జీవితంలో చూస్తామనుకోలేదని, సీఎం జగన్ దయతో తమ గ్రామానికి రోడ్డు నిర్మాణం జరగడం.. అంతా ఓ కలగా ఉందని స్థానికులు చెప్తున్నారు.

ఐదు నిమిషాల్లో మెయిన్ రోడ్డుకు



గతంలో గూడెం నుంచి మెయిన్ రోడ్డుకు చేరుకోవాలంటే నానా యాతనలు పడాల్సి వచ్చేది. ద్విచక్రం వాహనం కూడా వెళ్లేందుకు వీల్లేని పరిస్థితి. ఇపుడు గూడెంలో బైక్ స్టార్ట్ చేస్తే ఐదు నిమిషాల్లో మెయిన్‌రోడ్డుకు వచ్చేయొచ్చు. ఇక్కడి మా ప్రజల సంతోషాన్ని చెప్పేందుకు నాకు మాటలు చాలడం లేదు. రోడ్డు నిర్మాణ నాణ్యతలో రాజీలేకుండా పనుల్ని పర్యవేక్షిస్తున్నా.

– చవ్వాకుల వెంకటరమణ, వైఎస్సార్‌సీపీ నాయకుడు

అనిత ఆరోపణలు అవాస్తవం



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ లంక సూరిబాబు, సాయిబాబా, శ్రీనివాసరావు

పాయకరావుపేట : పాయకరావుపేట మెయిన్‌రోడ్డు నిర్మాణంపై మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత చేస్తున్న వ్యాఖ్యలు అవాస్తవాలని జెడ్పీటీసీ లంక సూరిబాబు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూటూరు శ్రీనివాసరావులు కొట్టిపారేశారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మెయిన్‌రోడ్డు విస్తరణ చేపట్టకుండా చిల్లర వర్తకుల సంఘం పేరుతో అధ్యక్షుడిగా కొనసాగుతున్న టీడీపీకి చెందిన గుళ్ల నాగరాజు కోర్టునాశ్రయించినట్టు తెలిపారు. కోర్టు కేసు ఉపసంహరించుకుంటే ఏనాడో రోడ్డు నిర్మాణం పూర్తయ్యేదన్నారు. ప్రజల ఇబ్బందుల దృష్ట్యా ఎమ్మెల్యే కృషితో రూ.కోటీ 80 లక్షలతో రోడ్డు నిర్మాణం చేపడుతుంటే, పూర్తి స్థాయిలో రోడ్డు నిర్మాణం చేపట్టడం లేదని మాజీ ఎమ్మెల్యే విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. చుట్టం చూపుగా పాయకరావుపేట వచ్చి పార్టీలో ఉనికి కోసం అవగాహన లేని ప్రకటనలు చేసి ప్రజల్ని మభ్యపెట్టడం తగదన్నారు. మాజీ ఎమ్మెల్యే అనితకు దమ్ము ధైర్యం చిత్త శుద్ధి ఉంటే రోడ్డు విషయంలో కోర్టు దావాను విరమించుకుని సహకరించే విధంగా చేయాలన్నారు. ప్రస్తుతం ప్రారంభిస్తున్న రోడ్డు 43 అడుగులు వస్తుందని, దశల వారీగా మరింత అభివృద్ధి చేయనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో మత్స్యకార నాయకుడు మైలపల్లి అశోక్, పంచాయతీ వార్డు సభ్యులు పిరాధి రాజు, తుమ్మలపల్లి సతీష్ పాల్గొన్నారు.

పాత స్థలంలోనే భవన నిర్మాణాలు

రాంబిల్లి: కొత్తపట్నం గ్రామ ఉన్నత పాఠశాలలో శిథిలావస్థకు చేరుకున్న భవనాలను తొలగించి, ఆ స్థలంలోనే కొత్త భవనాలను నిర్మిస్తున్నట్లు ఎఈవో ఎం.సూర్యారావు తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ, అటవీ స్థలంలో భవన నిర్మాణాలు చేస్తున్నట్లు వస్తున్న వార్తలు నిజం కాదన్నారు. 20 ఏళ్లుగా ఉన్న శిథిల భవనాలను తొలగించి నాడు–నేడు పథకంలో కొత్త భవనాలను నిర్మిస్తున్నామన్నారు. ఇదే గ్రామంలో 2019లో నాడు–నేడు మొదటి దశలో ప్రాథమిక పాఠశాలకు మరమ్మతులు చేపట్టినట్లు తెలిపారు. కొత్తపట్నంలో ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు ఒకే ప్రాంగణంలో ఉన్నాయన్నారు.

సమాజ ప్రగతిలో ఉపాధ్యాయుడు కీలకం



సత్కారం పొందిన బదిలీ ఉపాధ్యాయులతో సచివాలయ కన్వీనర్, ఎంఈవో తదితరులు

మునగపాక: సమాజ ప్రగతిలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో కీలకమైనదని నాగవరం సచివాలయ కన్వీనర్, మాజీ ఎంపీపీ దాసరి గౌరీలక్ష్మి అప్పారావు అన్నారు. మండలంలోని నాగవరంలో ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు మంగళవారం సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ ఉపాధ్యాయులు అంకిత భావంతో పనిచేయాలన్నారు. పిల్లల చదువులపై ప్రత్యేక దృష్టి సారించి, వారి అభ్యున్నతికి పాటుపడాల్సిందిగా కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం నాడు–నేడు పథకం ద్వారా రూ.కోట్లు వెచ్చిస్తోందని, ఆ ఫలాలు రేపటి తరానికి అందేలా ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో వేణుగోపాలరావు, మాజీ సర్పంచ్ సన్యాసిరావు, వెంకట్, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

కోనవానిపాలెంలో 'గడప గడపకు' నేడు

ఎస్.రాయవరం: మండలంలోని తిమ్మాపురం శివారు కోనవానిపాలెంలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రామచంద్రమూర్తి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. అధికారులు హాజరుకావాల్సిందిగా కోరారు.

11న విద్యుత్ వినియోగదారుల వేదిక

యలమంచిలి: ఈ నెల 11న యలమంచిలి ఏపీఈపీడీసీఎల్ సబ్ డివిజన్ కార్యాలయంలో విద్యుత్ వినియోగదారులసమస్యలపరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు అనకాపల్లి ఈఈ(ఆపరేషన్స్) రాజశేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావచ్చన్నారు. వీటి పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు. ఫోరం చైర్మన్ పి.సత్యనారాయణ అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమాన్ని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

భూ రీసర్వే పనుల పరిశీలన



రీసర్వే పనులను పరిశీలిస్తున్న ఆర్డీవో జయరాం

పాయకరావుపేట: మండలంలోని మాసాహేబుపేట, గోపాలపట్నం గ్రామాల్లో ఆర్డీవో ఎం.వి.జయరాం భూ రీసర్వే పనులను మంగళవారం పరిశీలించారు. మాసాహేబుపేట గ్రామంలో రీసర్వే రాళ్లు పాతే పనుల్ని పర్యవేక్షించారు. గోపాలపట్నంలో రీసర్వే పనులను సచివాలయం నుంచి ఆన్‌లైన్ ద్వారా పరిశీలించారు. శ్రీరాంపురం గ్రామ పరిధిలోని కోర్టు వివాదంలో వున్న భూముల్ని పరిశీలించారు. ఆర్డీవో వెంట డీటీ కె.నూకరాజు, సర్వేయర్ పి.సత్యనారాయణ వున్నారు.

సంక్షేమ పథకాలే పేదలకు శ్రీరామరక్ష

'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే బాబూరావు



పెంటకోటలో సంక్షేమ పథకాల బ్రోచర్లను అందిస్తున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, చిక్కాల రామారావు

పాయకరావుపేట : రాష్ట్రంలో పేద ప్రజలకు సంక్షేమ పథకాలే శ్రీరామరక్ష అని, పేదలందరి సంక్షేమమే తమ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. మండలంలోని పెంటకోటలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. బడుగు, బలహీన వర్గాల ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందాలన్నదే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పమన్నారు. తీర ప్రాంత గ్రామమైన పెంటకోటలో మత్స్యకారులకు మత్స్యకార భరోసా నగదు జమ గురించి మత్స్యకారులను ఆరాతీశారు.

అనంతరం గ్రామంలో అర్హులకు అమ్మ ఒడి, రైతు భరోసా, జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతి దీవెన, విద్యా కానుక, డ్వాక్రా సంఘాలకు రుణాలు మంజూరు తదితర పథకాలు అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాల నమోదులో వలంటీర్ల పనితీరును కనుక్కున్నారు. గ్రామంలో ఇళ్ల స్థలాలు లేని వారికి స్థలాలు మంజూరు చేసి, నిర్మాణానికి రుణ సౌకర్యం కల్పిస్తామన్నారు. ప్రతి ఒక్కరికీ సంక్షేమ లబ్ధి అందాలనే దరఖాస్తు చేసుకున్న వారందరికీ జగనన్న సురక్ష కార్యక్రమంలో ధ్రువపత్రాలు మంజూరు చేసినట్టు పేర్కొన్నారు. అర్హులై ఉండీ, సంక్షేమ పథకాలు అందనివారుంటే తక్షణమే గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాల్సిందిగా సూచించారు. నిత్యం ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధికి పరితపిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా గ్రామంలో సంక్షేమ లబ్ధి పొందిన వారి వివరాలను గణాంకాలతో సహా వివరించారు. స్థానిక సమస్యలను తెలుసుకుని తక్షణ పరిష్కారానికి అక్కడే ఉన్న అధికారులను ఆదేశించారు.

కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు, ఎంపీపీ ఇసరపు పార్వతీ తాతారావు, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా, పీఏసీఎస్ చైర్మన్ దేవవరపు రాజేష్ ఖన్నా, సర్పంచ్‌లు చేపల నాగమణి, సకిలేటి రాము, మేడిశెట్టి రామగోవిందు, వంగలపూడి రామారావు, కోడ కోటేశ్వరరావు, గెడ్డమూరి శ్రీనివాసరావు, ఉపసర్పంచ్ చిక్కాల బాబు, జిల్లా బీసీ సెల్ కార్యదర్శి యజ్జల సత్యనారాయణ, ఎంపీటీసీ కలిదిండి సతీష్ రాజు, బీసీ సెల్ మండల అధ్యక్షుడు పక్కుర్తి లోవకుమార్, పార్టీ జిల్లా కార్యదర్శి దేవవరపు వెంకటేశ్వరరావు, ఎంపీడీవో సాంబశివరావు, సచివాలయ మండల కన్వీనర్ బొలిశెట్టి శ్రీను, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిర్మూలన, పారిశుధ్యానికి కృషి



తడి, పొడి చెత్తపై మహిళలకు అవగాహన కల్పిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు



సోమలింగపాలెంలో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీటిని పరిశీలిస్తున్న శ్రీనివాసరావు

యలమంచిలి: సంపూర్ణ పారిశుధ్యం, ప్లాస్టిక్ నిర్మూలన దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు కోరారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధి సోమలింగపాలెంలో పారిశుధ్యం, ప్లాస్టిక్ నిషేధంపై స్థానికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి ముందున్న కాలువల్లో ప్లాస్టిక్ వ్యర్థాలను వేయరాదని, తడి, పొడి చెత్తను వేర్వేరుగా పారిశుధ్య కార్మికులకు అందించాలని సూచించారు. వర్షాకాలంలో మురుగు నీటి కాలువల్లో వ్యర్థాలు వేయడం వల్ల, దోమలు పెరిగి సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. ఇళ్లల్లో ఉండే పనికిరాని సామాన్లను తమ సిబ్బందికి అందిస్తే, వాటిని రీసైక్లింగ్ చేయడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు దోహదపడినవారవుతారని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే, చాలా వరకు ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. కార్యక్రమంలో వార్డు శానిటరీ అసిస్టెంట్ రేఖా రమణ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

డిమాండ్ల సాధనకు మున్సిపల్ కార్మికుల ధర్నా



సమస్య పరిష్కారానికి మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

యలమంచిలి: మున్సిపల్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి గనిశెట్టి ఏసుదాసు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర సంఘం పిలుపు మేరకు మంగళవారం యలమంచిలి మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికులు, కాంట్రాక్ట్ వర్కర్లతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని రెగ్యులరైజ్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం, బకాయిల చెల్లింపు, కారుణ్య నియామకాలపై సత్వర చర్యలు తీసుకోవాలని కోరారు. కార్మికుల హక్కులపై బుధవారం విజయవాడలో నిర్వహించే మహాధర్నాను జయప్రదం చేయాలని కోరారు. అనంతరం తమ డిమాండ్లపై మున్సిపల్ అధికారులకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు వై.నూకరాజు, హెచ్.వెంకటరమణ, డి.మహేష్, ఇ.చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో వక్తృత్వ పోటీలు

యలమంచిలి: అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్ఎఫ్) 88వ ఆవిర్భావ వేడుకల్లో భాగంగా యలమంచిలి పట్టణంలో మంగళవారం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ప్రభుత్వాలను ఎన్నుకోవడంలో విద్యార్థి, యువత పాత్ర అనే అంశంపై ఈ పోటీలను ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.బాబ్జి మాట్లాడుతూ సమాఖ్య ఆవిర్భవించి 87 ఏళ్లు పూర్తి చేసుకుని, 88వ వసంతంలోకి అడుగిడిన నేపథ్యంలో విద్యార్థులకు సామాజిక బాధ్యతను తెలిపి, వారిలో చైతన్యం పెంచేందుకు పాఠశాలల్లో వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. విజేతలకు ఈ నెల 12న తమ సమాఖ్య ఆవిర్భావ దినోత్సవాన బహుమతులను అందించనున్నట్లు వెల్లడించారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.ఫణీంద్రకుమార్, న్యాయ నిర్ణేతగా ఎస్టీయూ నాయకుడు, హెచ్ఎం సన్యాసిరావు, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయుడికి సత్కారం

ఎస్.రాయవరం: ఉపాధ్యాయులకు బదిలీలు సర్వ సాధారణమని పీఆర్‌టీయూ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు డి.గోపీనాథ్ అన్నారు. పీఆర్‌టీయూ మండల అధ్యక్షునిగా, పెదగుమ్ములూరు హైస్కూల్ సోషల్ టీచర్‌గా పనిచేసి, బదిలీపై వేపగుంట వెళ్లిన లక్ష్మీనారాయణను మంగళవారం ఘనంగా సత్కరించారు. ఆయన అందించిన సేవల్ని కొనియాడారు. సంఘ సభ్యులు శ్రీనివాసరావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అంకిత భావంతో పనిచేస్తే గుర్తింపు



బదిలీపై వెళ్లిన డాక్టర్ అనిల్‌కుమార్‌ను సత్కరిస్తున్న దృశ్యం

మునగపాక: విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేసే ఉద్యోగులకు తగిన గుర్తింపు ఉంటుందని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి నంది విమల గిరి అన్నారు. మునగపాక పీహెచ్‌సీలో వైద్యాధికారిగా పనిచేసి బదిలీపై వెళ్లిన డాక్టర్ అనిల్‌కుమార్‌ను ఆస్పత్రి ఆవరణలో మంగళవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కోవిడ్ సమయంలో మెరుగైన సేవలందించి అనిల్ కుమార్ ఆదర్శంగా నిలిచారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సూరిశెట్టి సుధారాణి, సీహెచ్‌వో దేవకాంత, స్టాఫ్‌నర్స్ సలిమా, ఫార్మసిస్ట్ తులసి, హెచ్ఎస్ ఉమామహేష్, ఆయుష్ వైద్యాధికారి సరోజిని, వైద్య సిబ్బంది నాయుడు, దేవకి, రేవతి తదితరులు పాల్గొన్నారు.

పాల ఉత్పత్తి పెంపునకు కృషి చేయాలి

నక్కపల్లి: విశాఖ డెయిరీకి పాల ఉత్పత్తి, సరఫరా పెంచేందుకు వేతన కార్యదర్శులు, సొసైటీ అధ్యక్షులు కృషి చేయాలని డెయిరీ డైరెక్టర్ రెడ్డి రామకృష్ణ కోరారు. మండలంలోని చినదొడ్డిగల్లు బీసీసీ పరిధిలో వేతన కార్యదర్శులు, సొసైటీ అధ్యక్షులతో మంగళవారం రేబాక గూడుపమ్మతల్లి ఆలయం వద్ద ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతుల అభివృద్ధి, సంక్షేమానికి కృషితోపాటు, పాడిపశువుల కొనుగోలుకు రుణాలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. రైతులకు అవగాహన కల్పించి పాల సేకరణ పెంచాలని సూచించారు. రెడ్డి రామకృష్ణను, తుని యూనిట్ మేనేజర్ శ్రీను, సూపర్‌వైజర్ కిరణ్, మాజీ ఎంపీపీ బొల్లం బాబ్జీలను, వేతన కార్యదర్శులను, సొసైటీ అధ్యక్షులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు సాదిరెడ్డి శ్రీనివాసరావు, వరహాలబాబు, ఉపమాక పాల సొసైటీ అధ్యక్షుడు కొప్పిశెట్టి కొండబాబు, సూపర్‌వైజర్లు, సిబ్బంది, వేతన కార్యదర్శులు, సొసైటీ అధ్యక్షులు పాల్గొన్నారు.

అందరి సహకారంతో ఓటరు జాబితా సవరణ

నక్కపల్లి: ప్రస్తుతం గ్రామాల్లో జరుగుతున్న ఓటర్ల జాబితా సవరణకి అన్నిపార్టీలు, ప్రజాసంఘాలు సహకరించాలని పాయకరావుపేట నియోజకవర్గ ఈఆర్‌వో రామలక్ష్మి కోరారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వివిధ పార్టీల నేతలతో సమావేశమయ్యారు. కొత్త ఓటర్ల నమోదు సవరణలపై బీఎల్‌వోలు ఇంటింటికీ తిరిగి పరిశీలన చేస్తున్నారన్నారు. ఓట్ల తొలగింపు, అదనపు పోలింగ్ బూత్‌ల ఏర్పాటు తదితర అంశాల్లో అన్ని పార్టీల వారూ సలహాలు సూచనలు అందించాలన్నారు. గడువు దగ్గర పడుతోందని, సవరణలు పూర్తి చేసి ముసాయిదా జాబితా విడుదలకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. అభ్యంతరాలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఆదివారాల్లో కూడా ప్రత్యేక డ్రైవ్ కొనసాగుతుందన్నారు. సమావేశంలో మండల వైస్ ఎంపీపీ వీసం నానాజీ, వైఎస్సార్‌సీపీ నాయకుడు శీరం నర్సింహమూర్తి, వివిధ పార్టీల నాయకులు, తహసీల్దార్లు అంబేడ్కర్, వేణుగోపాల్, జయప్రకాష్ పాల్గొన్నారు.

బదిలీ అయిన ఏపీవోకు సన్మానం

నక్కపల్లి: స్థానిక ఎన్ఆర్‌ఈజీఎస్ ఏపీవోగా పనిచేస్తూ, బదిలీ అయిన ఈశ్వరరావుని మంగళవారం సిబ్బంది, పలువురు ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, జెడ్పీటీసీ సభ్యులు గోశాల కాసులమ్మ, రాష్ట్ర పట్టణ ఆర్థిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ వీసం రామకృష్ణ తదితరులు ఈశ్వరరావును సన్మానించి, ఆయన సేవల్ని కొనియాడారు.

శ్రీశైలం బయలు దేరిన సమరసత సభ్యులు

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురంతో పాటు పలు మండలాల నుంచి సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులు మంగళవారం శ్రీశైలం బయలుదేరారు. ఈ నెల 9 నుంచి మూడు రోజుల పాటు శ్రీశైలంలో జరగనున్న సమరసత సేవా ఫౌండేషన్ రాష్ట్ర(ప్రాంత) సమావేశంలో వీరు పాల్గొననున్నారు. బయలుదేరిన వారిలో అనకాపల్లి జిల్లా ధర్మ ప్రచారకులు నక్కా సత్యనారాయణ, అచ్యుతాపురం సబ్ డివిజన్ ధర్మ ప్రచారకులు కొల్లి అప్పారావు, పరవాడ వెన్నెల అప్పలనాయుడు, తవ్వా సన్యాసిశెట్టితో సహా పలువురు ప్రతినిధులు ఉన్నారు.

ఓటరు జాబితా సవరణలో అప్రమత్తం

అచ్యుతాపురం(అనకాపల్లి): ఓటర్ల జాబితా సవరణ, మార్పులు, చేర్పుల్లో అందరూ అప్రమత్తంగా ఉండాలని, నకిలీ ఓట్లను తొలగించేందుకు అందరూ సహకరించాలని యలమంచిలి నియోజకవర్గ ఈఆర్‌వో జ్ఞానవేణి సూచించారు. మంగళవారం అచ్యుతాపురం మండలంలోని రామన్నపాలెం నేవల్ బేస్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లతో ఆమె సమావేశమయ్యారు. ఓటరు జాబితా సవరణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమీక్షించారు.

తొలిరోజు నామినేషన్లు నిల్

ఎస్.రాయవరం: మండలంలో సర్పంచ్, వార్డు మెంబర్ ఎన్నికకు తొలిరోజైన మంగళవారం ఎవరూ నామినేషన్లు దాఖలు చేయలేదని ఎంపీడీవో రామచంద్రమూర్తి తెలిపారు. నామినేషన్‌కు రెండు రోజులు గడువుందన్నారు. మండలంలో కొరుప్రోలు సర్పంచ్ స్థానానికి, చినగుమ్ములూరు, గుడివాడ, లింగరాజుపాలెం గ్రామాల్లో వార్డు మెంబర్లకు ఉప ఎన్నిక జరగనుంది.